ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శుక్రవారం 12 జూలై 2024 | 5




సూరాయిచెరువులో ఎండిపోతున్న దమ్ముచేసిన వరి చేను


సోమిదేవరపాలెంలో నీరు లేక దమ్ము చేయకుండా ఉన్న చేను

గోదావరిలో నీరు పుష్కలంగా ఉంది... అడపాదడపా వర్షాలు పడుతున్నాయి... అయినా ఖరీఫ్‌లో రైతులు సాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారంటే ఆశ్చర్యమే.... పంటకాల్వల అధ్వానస్థితే ఇందుకు కారణం. పంట కాల్వల నిర్వహణలో ఇరిగేషన్ శాఖ అధికారులు వైఫల్యం రైతుల పాలిట శాపంగా మారుతోంది. మాగాం-అయినాపురం పంట కాల్వను ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

ఖరీఫ్‌లో నీటి ఎద్దడా!

పంట కాల్వల నిర్వహణ సక్రమంగా లేని వైనం

సాగునీటి సరఫరాకు ఆటంకం

ముమ్మిడివరం, జూలై 11: పంట కాల్వలకు నీరు విడుదలై నెలా 12 రోజులు కావస్తున్నా సాగునీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో వరినాట్లు ముందుకు సాగట్లేదు. అయినాపురం పంటకాల్వ మాగాం నుంచి అయినాపురం వరకు 15.6 కిలోమీటర్ల నిడివి కలిగి ఉంది. ఈ పంట కాల్వపై సుమారు 3,600 ఎకరాల్లో వరి సాగవుతోంది. సాగునీటిని క్రమబద్ధీకరించేందుకు గతంలో నిర్మించిన డ్యామ్‌లు శిథిలం కావడం, పంట బోదెలకు ఏర్పాటుచేసిన తూరలు ధ్వంసం కావడం వంటి కారణాలతో సాగునీరు సక్రమంగా సరఫరా కావట్లేదు. కొన్నిచోట్ల సాగునీరు మురికి కాల్వల్లోకి వృథాగా వెళ్లిపోతుంటే మరికొన్నిచోట్ల సక్రమంగా అందట్లేదు. దీనికి తోడు కాల్వలో గుర్రపుడెక్క, తూడు, చెత్తాచెదారం వంటివి పేరుకుపోవడంతో కాల్వ శివారు ప్రాంతానికి నీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. క్రాపచింతలపూడి, చిప్పలపాలెం, సోమిదేవరపాలెం, అయినాపురం వద్ద పంట కాల్వ సుమారు ఐదారు కిలోమీటర్ల మేర అధ్వానంగా మారింది. ఉపాధి హామీ పథకంలో కాల్వలో పూడికను అరకొరగా తీస్తున్నారు. దీంతో మళ్లీ పేరుకుపోతున్నాయి. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం లేకపోవడంతో అక్కడ కాల్వలో పూడిక తీయట్లేదు. ఎక్స్‌కవేటరుతో చెత్తను తొలగించినా అంత ప్రయోజనం చేకూరట్లేదు. చెత్తను మనుషులతో పూర్తిగా తొలగింపచేసి కెమికల్ ట్రీట్మెంట్ చేస్తే కొంతకాలం ఈ సమస్య తలెత్తదని రైతులు చెప్తున్నారు.

సోమిదేవరపాలెం, యరకాయిచెరువు తదితర ప్రాంతాల్లో ఖరీఫ్ సాగుకు నీరు అందక సుమారు 300 ఎకరాల్లో నాట్లు పడలేదు. నారుమడులు పోసి 30 రోజులు దాటినా నాట్లు వేయడానికి చేలు దమ్ము చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఒకపక్క సాగునీరు లేక చేలను దమ్ము చేయని పరిస్థితి ఉండగా మరోపక్క దమ్ము చేసిన చేలు నీరు లేక ఎండిపోతున్నాయి. ఇరిగేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



నీరందక ఇబ్బంది పడుతున్నాం

జయన బాబ్జీ, కౌలు రైతు, కొత్తలంక

సోమిదేవరపాలెంలో 25 ఎకరాల చేను కౌలుకు చేస్తున్నా. నారుమడి కోసం 30 రోజులు అయ్యింది. నాట్లు వేద్దామంటే చేలకు నీరందక దమ్ములు చేయలేకపోయాం. ఖరీఫ్‌లో కూడా ఇంజన్లతో నీరు తోడుకునే పరిస్థితి ఉంది. పంట కాల్వలు అధ్వానంగా ఉండడం వల్లే నీరు సక్రమంగా అందట్లేదు. కాల్వ ఎగువన నీరు పుష్కలంగా ఉంది. ముమ్మిడివరం, సోమిదేవరపాలెం వద్ద కాల్వలో గుర్రపుడెక్క పేరుకుపోవడంతో నీరు సక్రమంగా అందట్లేదు.



కాల్వను ఆధునికీకరించాలి

కుడుపూడి అర్జునరావు, కౌలు రైతు, సూరాయిచెరువు

పది ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. ఖరీఫ్, రబీల్లో కూడా నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నాం. కాల్వ అధ్వానంగా ఉంది. ఆధునికీకరించకపోతే మాకు సమస్య తప్పదు. దమ్ము చేసినవరి చేలు ఎండిపోతున్నాయి. ఇంజన్లతో నీరు తోడుకుని దమ్ము చేయాలంటే సాగు వ్యయం పెరిగిపోతోంది. రెండు పంటలకూ ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నాం. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలకు పెట్టుబడులు ఎలా ఉన్నా నీటి సమస్య ఎక్కువగా ఉంది.


అయినాపురం వద్ద అడుగంటిన సాగునీరు


క్రాపచింతలపూడి వద్ద మాగాం-అయినాపురం పంట కాల్వ


ముమ్మిడివరం బైపాస్ వద్ద అధ్వానంగా మాగాం-అయినాపురం పంటకాల్వ


ముమ్మిడివరం సమీపంలో గుర్రపుడెక్కతో నిండి...

చనిపోయిన కొబ్బరి చెట్లు, ఆక్రమిత డ్రెయిన్లు చూసి...

చలించిన రాజోలు ఎమ్మెల్యే

మలికిపురం, జూలై 11: శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ పరివాహక ప్రాంతమైన కేశనపల్లి, తూర్పుపాలెం, గొల్లపాలెం గ్రామాల్లో ఉప్పునీటి తాకిడికి చనిపోయిన కొబ్బరిచెట్లను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ గురువారం పరిశీలించారు. కేశనపల్లి నుంచి ఆయన పాదయాత్రగా బయల్దేరి వెళ్లారు. రాజోలు నియోజకవర్గంలో డ్రైనేజీ వ్యవస్థ అత్యంత దుర్భరంగా మారిందన్నారు. సముద్ర తీర ప్రాంతంలో డ్రెయిన్లను ఆక్రమించుకుని ఆక్వా చెరువులుగా మార్చుకోవడాన్ని చూసి నిశ్చేష్టులయ్యారు. ఇదే పరిస్థితి కొనసాగితే మన భవిష్యత్తు, భావితరాల భవిష్యత్తు కనుమరుగవుతుందని ఆందోళన చెందారు. అనాదిగా ఆక్రమణలతో కనుమరుగైన గోగన్నమఠం డ్రెయిన్‌ను పరిశీలించారు. ఎనిమిది కిలోమీటర్ల పరిధిలో ఉన్న డ్రెయిన్‌ను ఆక్రమించుకోవడం తద్వారా సముద్రపు ఆటుపోట్లలో ఉప్పునీరు డ్రెయిన్ గుండా పారక శంకరగుప్తం డ్రెయిన్‌లో కలవడంతో ఈ సమస్య ఏర్పడిందన్నారు. 30 మీటర్ల వెడల్పున ఉండే గోగన్నమఠం డ్రెయిన్ మొత్తం మూసుకుపోవడంతో దానికి సమాంతరంగా శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ పనిచేయట్లేదన్నారు. సరైన అవగాహన లేకుండా పదేళ్ల క్రితం శంకరగుప్తం డ్రెయిన్‌ను డ్రెడ్జింగ్ చేయడం వల్ల మరింత క్షీణించిందన్నారు. శంకరగుప్తం, గోగన్నమఠం డ్రెయిన్ల దుస్థితి వల్ల రాజోలు నియోజకవర్గంలో 30వేల ఎకరాల్లో పంట పండాల్సి ఉండగా సార్వాకు కేవలం 5వేల ఎకరాల్లోనే నాట్లు పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. తీరం వెంబడి గ్రామాల్లో కొబ్బరిచెట్లు ఈ డ్రెయిన్ ఆటుపోట్లతో దెబ్బతిన్నాయని, ఈ ప్రాంత ప్రజల జీవనోపాధి కూడా దెబ్బతిందన్నారు. రైతులు ముందుకు వస్తే ఆక్రమణలను తొలగిద్దామని ప్రజాభిప్రాయం కోరారు. ఆక్రమిత చెరువుకు విద్యుత్ కనెక్షన్ ఎలా ఇచ్చారని విద్యుత్ శాఖ అధికారులను ప్రశ్నించారు. చనిపోయిన కొబ్బరిచెట్లను, ముంపునకు గురైన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఎంపీపీ ఎంవీ సత్యవాణి, గుండుబోగుల పెదకాపు, సర్పంచ్‌లు యెనుముల నాగు, మందపాటి నాగేశ్వరరావు, జి.సత్యనారాయణ, అడబాల సాయిబాబు, దిరిశాల బాలాజీ, పినిశెట్టి బుజ్జి, యింటిపల్లి ఆనంద రాజు, అడబాల నగేష్, ఆకుల చినవెంకన్నాయుడు, జక్కంపూడి శ్రీదేవి, అడబాల సత్యనారాయణ, గెడ్డం మహలక్ష్మిప్రసాద్ పాల్గొన్నారు.




తీర ప్రాంతంలో చనిపోయిన కొబ్బరిచెట్లను పరిశీలిస్తున్న రాజోలు ఎమ్మెల్యే వరప్రసాద్

నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకులను వినియోగంలోకి తేవాలి: డీపీవో

అంబాజీపేట, జూలై 11: గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకులను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు సూచించారు. పుల్లేటికుర్రులో తాగునీరు రావట్లేదన్న స్థానికుల ఫిర్యాదుతో గురువారం ఆయన గ్రామంలో పర్యటించారు. రక్షిత మంచినీరు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శి విత్తనాల వెంకటరమణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి సరఫరాలో చిన్న చిన్న సమస్యలను పరిష్కరించడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ట్యాంకుల నుంచి తాగునీరు వెళ్లేలా చర్యలు తీసుకురావాలన్నారు. వచ్చే ఇబ్బందులను పరిశీలించి రిపేర్లు చేయించాలన్నారు. తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీ ట్యాంకు పనిచేసేలా చర్యలు తీసుకుని అవసరమైన మరమ్మతుల కోసం ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ పద్మనాభం, జేఈ చలమయ్య, ఈవోపీఆర్డీ మమత, పంచాయతీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రయోగశాలలో బదనికలను పరిశీలిస్తున్న ఎంపీ హరీష్

కొబ్బరిలో నూతన వంగడాలు సృష్టించాలి

- కొబ్బరిలో ఉప ఉత్పత్తుల తయారీ పరిశ్రమల ఏర్పాటుకు కృషి
- అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్

అంబాజీపేట, జూలై 11: తెగుళ్లు, పురుగులు తట్టుకునే విధంగా కొబ్బరిలో నూతన వంగడాలను సృష్టించి కొబ్బరికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు శాస్త్రవేత్తలు కృషి చేయాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ సూచించారు. గురువారం ఆయన అంబాజీపేటలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన పరిశోధనా కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ జరుగుతున్న పరిశోధనలు, కొబ్బరిలో రకాలు, పురుగులు, తెగుళ్ల వంటి వాటి గురించి పరిశోధనా కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావును అడిగి తెలుసుకున్నారు. పరిశోధనా కేంద్రం విస్తీర్ణంపై ఆరా తీశారు. 1996 తుపాను తర్వాత కొబ్బరికి తెగుళ్లు ఆశించి ఈ ప్రాంత రైతులు తీవ్రం గా నష్టపోయారని, గత కొన్నేళ్లుగా తెల్ల దోమ ఉధృతితో కొబ్బరి చెట్లు చనిపోయాయని ఎంపీ వివరించారు. ఈ తెగుళ్లు, పురుగులు అధిగమించే కొత్త వంగడాలను సృష్టించి కొబ్బరి రైతులకు మేలు చేయాలని శాస్త్రవేత్తలకు సూచించారు. పరిశోధనా కేంద్రం అధిపతి చలపతిరావు మాట్లాడుతూ కొబ్బరిని ఆశించే తెల్లదోమ నివారణకు బదనికలను తయారు చేసి రైతులకు అందిస్తున్నామన్నారు. రైతులు వీటిని సామూహికంగా కొబ్బరి తోటల్లో వినియోగిస్తే తెల్లదోమ ఉధృతి తగ్గుముఖం పడుతుందన్నారు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో తెల్ల దోమపై విస్తృతంగా ప్రచారం నిర్వహించి వాటి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. అనంతరం ఎంపీ హరీష్ విలేలకరులతో మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అపారమైన ఉత్పత్తులు ఉన్నాయన్నారు. కొబ్బరిలో ఉప ఉత్పత్తులు తయారు చేసే విధంగా పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. తద్వారా ఈ ప్రాంతంలోని యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. రైతులు కొబ్బరిలో అంతర పంటలు సాగు చేయడం ద్వారా కొంతమేర అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. రైతులకు యంత్ర పరికరాలను రాయితీపై అందిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ నామన రాంబాబు, సహ కన్వీనర్ దాసరి సత్యనారాయణ, నాయకులు గణపతి వీరరాఘవులు, బొంతు పెదబాబు, కొర్లపాటి గోపి, మైపాల తాతాజీ, గుడాల ఫణి, అరిగెల బలరామమూర్తి, వాకపల్లి దొరబాబు, ముత్యాల జమీలు, దొమ్మేటి సాయికృష్ణ, కొప్పినీడి ఈశ్వరరావు పాల్గొన్నారు.

వరద విపత్తును ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలి

మందుస్తు కార్యాచరణ ప్రణాళికలపై కలెక్టర్ మహేష్‌కుమార్ సమీక్ష

అమలాపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గోదావరి వరదల విపత్తులను ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధం కావాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం వరద విపత్తుల ముందస్తు కార్యాచరణ ప్రణాళికలపై వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. 2022లో గోదావరి వరదలను ఎదుర్కోవడానికి చేపట్టిన సహాయ, పునరావాస చర్యలను అడిగి తెలుసుకున్నారు. వరద హెచ్చరికలకు అనుగుణంగా ఏయే లంక గ్రామాలు, ఆవాసాలు ముంపు బారిన పడతాయో గుర్తించి పునరావాస చర్యలకు ఉపక్రమించాలని ఆదేశించారు. పంచాయతీ సిబ్బంది ముంపు బాధిత గ్రామాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. కొవ్వొత్తులు, గ్యాస్ లైట్లు వంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో పాటు సురక్షిత మంచినీరు సరఫరా చేసే విధంగా చర్యలుతీసుకోవాలన్నారు. కేంద్ర విపత్తుల నిర్వహణ, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థల హెచ్చరికలు, ముందస్తు సూచనలను సీపీవో పరిగణలోకి తీసుకుని అప్రతమత్తం చేయాలన్నారు. వరద గ్రామాల్లో పునరావాస కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి అన్ని రకాల మందులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పశువులను సమీప మెట్ట ప్రాంతాలకు తరలించి పశుగ్రాసం, దాణా ఏర్పాటు చేయాలన్నారు. ముంపు గ్రామాల్లోని పాఠశాలలకు వరదల సమయంలో సెలవులు ప్రకటించాలన్నారు. మంపు ప్రభావిత గ్రామాల్లో ఉన్న 94 చౌక ధరల దుకాణాల్లో నిత్యావసర వస్తువులను ఎక్కువ మోతాదులో నిల్వ చేయాలన్నారు. ఏటిగట్లు బలహీనంగా ఉన్నచోట్ల రక్షణచర్యల కోసం ఇసుక బస్తాలు, ఇతర సామగ్రి సమకూర్చుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు ఎస్.సుధాసాగర్, జి.కేశవర్ధనరెడ్డి, జీవీ సత్యనారాయణ, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అక్రమ మద్యం రవాణాకు అడ్డుకట్ట వేయాలి

అమలాపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి అక్రమ మద్యం సరఫరా కాకుండా అడ్డుకట్ట వేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. తరచూ అక్రమంగా సారా తయారు చేయడం, మద్యం రవాణా జరుగుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. అక్రమంగా సారా తయారీ, విక్రయాలకు పాల్పడి తరచూ కేసులు నమోదవుతున్న నిరుపేదలను గుర్తించి వారి స్థాయికి అనువైన ప్రభుత్వ పథకాలను వర్తింపచేసి శాశ్వత ప్రాతిపదికన జీవనోపాధి కల్పించాలని ప్రొహిబిషన్-ఎక్సైజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. సారా తయారీ, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్‌ల వద్ద మాత్రమే మద్యం విక్రయాలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో గంజాయి సరఫరా కాకుండా నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. అక్రమ మద్యం ఉత్పత్తి, రవాణా వంటి వ్యవహారాల్లో కఠినంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, అసిస్టెంట్ కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, సీఐ సాయిస్వరూప్, ఎస్ఈబీ సూపరింటెండెంట్ జి.అమర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


జనాభా నియంత్రణకు పాటుపడిన సిబ్బందికి మెమెంటో అందజేస్తున్న జేసీ నుపూర్‌అజయ్

జనాభా నియంత్రణకు కృషి చేయాలి

జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్

అమలాపురం టౌన్, జూలై 11: పెరుగుతున్న జనాభాతో మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ పేర్కొన్నారు. జనాభా పెరుగుదల ప్రభావాలను గుర్తించి పరిష్కారాలు అన్వేషించేందుకు ఏటా ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. జేసీ అధ్యక్షతన గురువారం కలెక్టరేట్‌లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో 35వ ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. పెరుగుతున్న జనాభా ద్వారా తలెత్తే దుష్పరిణామాలను ప్రజలకు వివరించేందుకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. 1989 నుంచి ఏటా జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అభివృద్ధి చెందిన భారత దేశానికి కొత్త గుర్తింపు కుటుంబ ప్రణాళిక అనేది ప్రతి దంపతులకు గర్వకారణమే లక్ష్యంతో ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు. జనాభా నియంత్రణకు పాటు పడాలని వైద్య సిబ్బందికి సూచించారు. జనాభా నియంత్రణకు కృషి చేసిన వైద్య సిబ్బందిని ప్రశంసిస్తూ మెమెంటోలు, ప్రశంసాపత్రాలను జేసీ అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, అదనపు డీఎంహెచ్‌వో సీహెచ్‌వీ భరతలక్ష్మి, ఆర్‌బీఎస్‌కే కో-ఆర్డినేటర్ జాన్‌లెవీ, ఐసీడీఎస్ పీడీ ఎం.ఝాన్సీరాణి, గైనకాలజిస్టు డాక్టర్ శ్రావణి, బి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.



...వివరాలు 7లో



సీఎస్ఈ క్రేజ్

అమలాపురం రూరల్, జూలై 11:

ఐటీ..మేటీ

దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఐటీ సెక్టార్ సంక్షోభంలో ఉంది. గత వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఐటీ సెక్టార్ ఏర్పాటు చేయకపోవడంతో మూడేళ్లుగా కంప్యూటర్ సైన్స్‌తో పాటు అనుబంధ విభాగాల్లో ఇంజనీరింగ్ పూర్తిచేసిన విద్యార్థులు ఇతర రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు. అక్కడి నుంచే ఉద్యోగ ప్రయత్నాలు చేసుకోవాల్సిన పరిస్థితిని గత జగన్ ప్రభుత్వం తీసుకువచ్చింది. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో సైతం ఇంజనీరింగ్ చదవాలనుకునేవారి సంఖ్య అంతకంతకూ పెరగడం ఒకెత్తు కాగా సంక్షోభంలో ఉన్న ఐటీ సెక్టార్‌లోనే చేరేందుకు విద్యార్థులు పోటీపడుతున్నారు. కౌన్సెలింగ్‌లో సీటు వచ్చిందా సరే లేదంటే లక్షలు వెచ్చించి అయినా మంచి కళాశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులు తహతహలాడుతున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పేరొందిన కళాశాలల్లో కంప్యూటర్ సైన్స్‌కు ఎంత డిమాండు ఉందో వాటి అనుబంధ విభాగాల ఇంజనీరింగ్ విద్యకూ అదే డిమాండు కొనసాగుతోంది. పేరొందిన కళాశాలల్లో కంప్యూటర్ సైన్స్ సీటు మేనేజ్‌మెంట్ కోటాలో పొందాలంటే రూ.5లక్షల నుంచి రూ.6లక్షల వరకు పలుకుతోంది. పక్క జిల్లాలోని భీమవరంలోని ఓ కళాశాలలో అయితే అదే సీటు రూ.14లక్షలు పైబడే వుంది.

- ఐటీ సెక్టార్‌లో సంక్షోభం ఉన్నా..
- కంప్యూటర్ సైన్స్‌పైనే మక్కువ
- మేనేజ్‌మెంట్ కోటా సీటుకైనా సిద్ధం
- రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ఫీజు
- ఉమ్మడి జిల్లాలో కంప్యూటర్ సైన్స్ అనుబంధ విభాగాల్లో 9,985 సీట్లు



సీట్లు..కళాశాలలు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 23 ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. వాటిల్లో మొత్తం సీట్లు 14,520. ప్రభుత్వ పరిధిలోని కాకినాడ జేఎన్టీయూతో పాటు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మొత్తం 780 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో ప్రధాన విభాగాలకు సంబంధించి 50 నుంచి 60 సీట్లు మాత్రమే ఉన్నాయి. ఇక మిగిలిన 20 ప్రైవేటు కళాశాలల్లో 13,740 సీట్లు ఉన్నాయి. ఈ ఏడాది ఇంజనీరింగ్ కళాశాలల్లో ఐటీ విభాగానికి సంబంధించి అదనంగా 60 సీట్లకు ఏఐసీటీఈ అనుమతి ఇచ్చింది. కంప్యూటర్ సైన్స్‌పై విద్యార్థులు విపరీతంగా క్రేజ్ పెంచుకున్నారు. అందుకు అనుగుణంగానే పలు కళాశాలల్లో సీఎస్ఈ, అనుబంధ ఇంజనీరింగ్ కోర్సులను మాత్రమే కలిగి ఉండడం విశేషం. కోరంగిలో మూడు ఇంజనీరింగ్ కళాశాలల పేరిట కంప్యూటర్ సైన్స్ కోర్సులను మాత్రమే అనుమతి పొందారు. మిగిలిన ఇతర ఇంజనీరింగ్ కోర్సులేవీ అక్కడ లేవు. సీఎస్ఈ, ఏఐడీఎస్, మెషీన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ వంటి ఇంజనీరింగ్ కోర్సులకు మాత్రమే అనుమతి పొందారు. ఒక్కో కళాశాలలోను 540 నుంచి 780 సీట్లు ఉన్నప్పటికీ అవన్నీ కంప్యూటర్ సైన్స్ అనుబంధ విభాగాలకు చెందినవే. సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ కోర్సులకు సంబంధించి మొత్తం 2,160 సీట్లు ఉండగా కంప్యూటర్ సైన్స్‌కు అనుబంధంగా ఉన్న కోర్సుల్లో 1,560 సీట్లు కేటాయించడం విశేషం. ఉమ్మడి జిల్లాలో 14,520 ఇంజనీరింగ్ సీట్లు ఉంటే కంప్యూటర్ సైన్స్ అనుబంధ విభాగాలకు 9,985 సీట్లు ఉన్నాయి. ఇక మిగిలిన 4,535 సీట్లు ఈసీఈ, ఈఈఈ, సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్, ఫుడ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, పెట్రోలియం, కెమికల్ ఇంజనీరింగ్ విభాగాలకు ఉండడం విశేషం.

సీఎస్ఈకి ఫుల్ డిమాండ్

ఐదేళ్ల క్రితం వరకు ఇంజనీరింగ్ విద్యలో కంప్యూటర్ సైన్స్ (సీఎస్ఈ) మాత్రమే ఐటీ విభాగంలో ఉంది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని కంప్యూటర్ సైన్స్‌కు అనుబంధంగా మరికొన్ని ఇంజనీరింగ్ కోర్సులను ప్రధాని నరేంద్రమోదీ తీసుకువచ్చి ప్రోత్సహించారు. కంప్యూటర్ సైన్స్‌తో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ అండ్ మెషీన్ లెర్నింగ్, డేటా సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వంటి ఇంజనీరింగ్ కోర్సులు కొత్తగా వచ్చి చేరాయి. ఇంజనీరింగ్ చదవాలనుకునే వారిలో అత్యధికంగా కంప్యూటర్ సైన్స్‌నే ఎంచుకుంటున్నారు. కౌన్సెలింగ్‌లో కంప్యూటర్ సైన్స్‌కు అనుబంధంగా ఉన్న డేటా సైన్స్, ఐటీ, ఇతర విభాగాలకు ఆప్షన్లు ఇచ్చుకుంటున్నారు.



కొనసాగుతున్న కౌన్సెలింగ్

రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ నిర్వహించిన ఈఏపీసెట్‌లో వచ్చిన ర్యాంకుల ఆధారంగా కౌన్సెలింగ్ కొనసాగుతోంది. ఇంజనీరింగ్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఎందరో జేఈఈ అడ్వాన్స్‌డ్, మెయిన్స్‌లో కూడా ఉత్తమ ర్యాంకులు సాధించారు. అటువంటి వారంతా ఐఐటీ, ఎన్ఐటీ వంటి జాతీయ విద్యా సంస్థల్లో చేరేందుకు సిద్ధపడ్డారు. కాకినాడ జేఎన్టీయూ, రాజమహేంద్రవరంలోని ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయాల్లో కంప్యూటర్ సైన్స్, ఐటీ సెక్టార్‌లో సీట్ల కోసం విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. ఆయా ప్రభుత్వ కళాశాలల్లో అంతంతమాత్రంగానే సీట్లు ఉండడం వారిని నిరాశ పరుస్తోంది. ఐటీ రంగంలో ఉద్యోగం పొందాలంటే కంప్యూటర్ సంబంధిత కోర్సులు చేయాల్సిన పరిస్థితి ఉంది. ప్రస్తుతం ఐటీ సెక్టార్‌లో సంక్షోభం ఉన్నప్పటికీ ఆ రంగంలోనే ఎక్కువగా ఉద్యోగాలు పొందే పరిస్థితి కనిపిస్తోంది. తొలుత తక్కువ ప్యాకేజీలో ఉద్యోగంలో చేరినా ఆ తర్వాత అనుభవంతో పాటు కొత్త కోర్సులు నేర్చుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని భావించి విద్యార్థులు కంప్యూటర్ సైన్స్‌పైనే ఎక్కువ మక్కువ చూపిస్తున్నారు. కౌన్సెలింగ్‌లో భాగంగా ఈ నెల 12వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకునే అవకాశం ఇచ్చారు. 13న ఆప్షన్లు మార్చుకునే అవకాశం ఉంది. 16వ తేదీన సీట్ల కేటాయింపు జరుగుతుంది. ఇక 17 నుంచి 22వ తేదీ వరకు విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. అనంతరం 19వ తేదీ నుంచి తరగతులు ప్రారంభించాలని ఇప్పటికే ఇంజనీరింగ్ కళాశాలలకు ఆదేశాలు అందాయి.



అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం కేసులో మైనర్ సహా ఐదుగురి అరెస్టు

ద్రాక్షారామ, జూలై 11: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వెల్ల గ్రామంలో అరుంధతీపేట వద్ద డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం కేసులో పోలీసులు బుధవారం ఒక మైనరు సహా ఐదుగురిని అరెస్టు చేశారు. వెల్ల గ్రామానికి చెందిన మైనరు బాలుడుతో సహా యర్రంశెట్టి త్రిమూర్తులు అలియాస్ తరుణ్, చిక్కాల వీరమణికంఠ అలియాస్ మణి, వేపూరి వీర వెంకటసత్యనారాయణ అలియాస్ నాని, ఈత రామచంద్రుడు అలియాస్ రాము, సిరిగినీడి దుర్గాప్రసాద్ అలియాస్ డి.పిలను గురువారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ బి.రామకృష్ణ తెలిపారు. డీఎస్పీ బి.రామకృష్ణ రామచంద్రపురం పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. వెల్ల గ్రామంలో అరుంధతీపేట వద్ద జగనన్నకాలనీలో ఉన్న డా.బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ధ్వంసం చేస్తే వేరొక ప్రాంతంలో పెట్టుకుంటారని పథకం ప్రకారం ఈనెల 4వ తేదీ అర్ధరాత్రి విగ్రహాలు పరిసర ప్రాంతంలో మద్యం సేవించారు. నిందితులు గునపంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని కొట్టి నేలకూల్చారు. విగ్రహం కిందపడినప్పుడు శబ్దం వచ్చి అలికిడి కావడంతో ఎవరైనా వచ్చి చూస్తారనే భయంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. వీరికి నేరంలో ఎప్పటికప్పుడు సమాచారం అందచేసి వారు తప్పించుకునేందుకు సిరిగినీడి దుర్గా ప్రసాద్ అలియాస్ డి.పి సహకరించారు. ఈ ఘటనపై ద్రాక్షారామ పోలీసుస్టేషన్‌లో ఈనెల 5న కేసు నమోదు చేశామని డీఎస్పీ చెప్పారు. జిల్లా ఎస్పీ శ్రీధర్ ఆదేశాల మేరకు ఏఎస్పీ ఖాదర్ బాషా పర్యవేక్షణలో సీఐ దొరరాజు సర్కిల్‌లో ఎస్ఐలతో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టామన్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం ఇతర సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సమగ్ర దర్యాప్తు చేశామన్నారు. నేరానికి ఉపయోగించిన రెండు మోటారు సైకిళ్లు, గునపం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసును చాకచక్యంగా ఛేదించిన డీఎస్పీ, సీఐ ఎస్ఐలు సురేంద్ర, జానీభాషా సురేష్‌బాబు, చైతన్య సిబ్బందిని ఎస్పీ శ్రీధర్ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

విద్యార్థినిని కత్తితో బెదిరించిన ఆగంతకుడు

కొత్తపేట, జూలై 11: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం అవిడి శివారు చప్పిడివారిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని బుధవారం మధ్యాహ్నం బాత్రూమ్‌కు వెళ్లగా ఓ ఆగంతకుడు కత్తితో బెదిరించి లొంగదీసుకునే ప్రయత్నం చేశాడు. బాలిక అతడిని వదలించుకుని కేకలు వేయడంతో ఉపాధ్యాయులు వెళ్లేసరికి ఆగంతకుడు గోడదూకి పరారయ్యాడని తెలుస్తోంది. షార్ట్, టీషర్ట్ వేసుకుని పెద్ద జుట్టుతో ఉన్న యువకుడిగా విద్యార్థిని గుర్తించింది. దీనిపై కొత్తపేట ఎస్ఐ ఎం.అశోక్‌కు పాఠశాల హెచ్ఎం కుంచే అరుణశ్రీ ఫిర్యాదు చేశారు. ఎంఈవో ఎం.హరిప్రసాద్, డీవైఈవో వెళ్లి బాలికను విచారించారు. ఎస్ఐ వివరాలు తెలుసుకున్నారు. దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వీసాల పేరుతో మోసం..కేసు నమోదు

పి.గన్నవరం, జూలై 11: మస్కట్ దేశంలో అగ్రిమెంట్ కంపెనీ వీసాలు పేరుతో మోసగించిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నాగుల్లంకకు చెందిన ఉండ్రాజవరపు సురేష్ ఉపాధి కోసం గల్ఫ్ దేశం వెళ్లాలనుకున్నాడు. మార్చి నెలలో రాజోలుకు చెందిన గుబ్బల దుర్గాప్రసాద్, శ్రీనులు సురేష్‌కు పరిచయమై మస్కట్ దేశంలో ప్రముఖ కంపెనీలో ఉద్యోగాలున్నాయని రూ.2 లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. దీంతో సురేష్ ఏప్రిల్ 4న మస్కట్ బయలుదేరగా ఎయిర్‌పోర్టు తనిఖీల్లో టూరిస్ట్ వీసాగా గుర్తించారు. ఈ విషయాన్ని ఏజెంట్లకు సూచించగా, మస్కట్‌లో తమ వాళ్లు ఉన్నారని ఇబ్బందులు ఉండవని చెప్పారు. దీంతో మస్కట్‌కు వెళ్లిన సురేష్ వసతులు లేక ఇబ్బందులు పడుతున్నాడు. తల్లి వెంకాయమ్మ ఏజెంట్ల వద్దకు వెళ్లి తన కుమారుడు ఇబ్బందులు పడుతున్నాడని, ఇండియాకు తిరిగి రప్పించాలని కోరింది. రూ.లక్ష ఇస్తే వెనక్కి రప్పిస్తామని ఏజెంట్లు డిమాండ్ చేశారు. దీంతో వెంకాయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. హెడ్ కానిస్టేబుల్ పీవీవీ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాటక రంగ పూర్వ వైభవానికి కృషి చేయాలి

ప్రముఖ రంగ స్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణ

పోర్టుసిటీ(కాకినాడ), జూలై 11: నాటక రంగం పూర్వ వైభవానికి కలిసికట్టుగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని ప్రముఖ రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. గురువారం రాత్రి సినిమా రోడ్డులో సూర్య కళా మందిరం అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో 24వ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వానపు నాటిక పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి గుమ్మడి గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోటీల్లో భాగంగా తొలుత మలిసంధ్య అనే నాటిక ప్రదర్శించారు. కుటుంబ బాంధవ్యాలు ఏ విధంగా ఉండాలి అనే అంశం ప్రధాన ఇతివృత్తంగా నాటిక ప్రదర్శన జరిగింది. అనకాపల్లి శ్రీ షిర్డీ సాయి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. జి.సుబ్బలక్ష్మి మూల కథ రాయగా, పొన్నాడ ముత్యాలరావు దర్శకత్వం వహించారు. అనంతరం నిర్వాహకులు గోపాలకృష్ణ తదితరులకు మెమెంటో అందించి సత్కరించారు. కళా పరిషత్ గౌరవ అధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రి అచ్యుత రామారెడ్డి, పంపన దయానంద బాబు పాల్గొన్నారు.



గుమ్మడి గోపాలకృష్ణకు జ్ఞాపిక అందిస్తున్న నిర్వాహకులు



మలిసంధ్య నాటికలో ఓ సన్నివేశం

టోలిన్ లిక్విడ్ ట్యాంకర్ బోల్తా

పెద్దాపురం, జూలై 11 : పెద్దాపురం ఏడీబీ రహదారిలో గురువారం తెల్లవారుజామున అత్యంత ప్రమాదకరమైన టోలిన్ లిక్విడ్‌తో వెళుతున్న ట్యాంకర్ బోల్తా పడింది. కాకినాడ నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న ట్యాంకర్ రోడ్డు పక్కన ఉన్న హైటెన్షన్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టంతో ఈ ప్రమాదం జరిగింది. పోలీస్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే రక్షణ చర్యలు తీసుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలం వద్ద మూడు అగ్నిమాపక శకటాలను సిద్ధం చేశారు. జన సంచారం లేని ప్రదేశం కావడంతో పెను ప్రమాదం తప్పింది. అప్పటికే ట్యాంకర్‌లో ఉన్న 11 టన్నుల లిక్విడ్ టోలిన్ గాల్లో కలిసిపోయిందని అధికారులు తెలిపారు. ట్యాంకర్‌లో ఉన్న మిగిలిన లిక్విడ్‌ను ఎయిర్‌ప్రెజర్ ద్వారా మరో ట్యాంకర్‌లోకి డంప్ చేశారు. సంఘటన జరిగిన రహదారిలో పోలీసులు ఎటువంటి వాహనాలను అనుమతించలేదు. ఏడీఎఫ్‌వో ఎం.శ్రీహరిజగన్నాథ్, ఎస్ఐ వెలుగుల సురేష్ సంఘటనా స్థలం వద్ద ఉండి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.



బోల్తాపడిన ట్యాంకర్

రైళ్లల్లో దొంగతనాలు

నిందితుడిని పట్టుకున్న పోలీసులు

తుని రూరల్, జూలై 11:కదులుతున్న రైళ్లలో, ఏసీ బోగీల్లో, స్లీపర్ బోగీల్లో నిద్రిస్తున్న ప్రయాణికుల నుంచి బంగారు ఆభరణాలు దొంగలించిన వ్యక్తిని రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. రైళ్లలోని నిఘా కెమెరాల ఆధారంగా కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లికి చెందిన 23 ఏళ్ల సేనాపతులు మనీష్ కదలికలను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 190 గ్రాముల బంగారు ఆభరణాలు, వీటి విలువ రూ.12 లక్షలు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నారు. తుని రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి విజయవాడ రైల్వే కోర్టు మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచనున్నట్లు రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారుఫ్ తెలిపారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ అబ్దుల్‌మారుఫ్‌తోపాటు సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ పితాని శ్రీనివాసరావు, కానిస్టేబుల్ రామకోటి, శివసురేష్, ప్రసాదరావు, జి.శ్రీనివాసరావు, ఏఎస్ఐ గోవిందరావులను రైల్వే ఎస్పీ అభినందించారు.

జీవితంపై విరక్తితో గోదావరిలోకి దూకిన వ్యక్తి

కాపాడిన ఫైర్ కానిస్టేబుల్

కొవ్వూరు, జూలై 11: గోదావరి నదిలో దూకి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తిని కొవ్వూరు ఫైర్ కానిస్టేబుల్ రక్షించాడు. అనకాపల్లి జిల్లా సబ్బవరం గ్రామానికి చెందిన చేబ్రోలు వెంకటరమణ మూర్తి 25 రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో నిద్ర లేక జీవితంపై విరక్తి చెందాడు. ఈ క్రమంలో కొవ్వూరు గామన్‌బ్రిడ్జి పైనుంచి ఈ నెల 11వ తేదీ రాత్రి గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న రాత్రి గస్తీ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఫైర్ సిబ్బందికి సమాచారం అందించాడు. దీంతో అగ్నిమాపక సిబ్బంది స్కూబా డ్రైవ్ మాస్టర్, స్విమ్మింగ్ ట్రైనర్ ఎం.ప్రకాష్‌బాబు రెస్క్యూ బోట్‌తో హుటాహుటిన నదిలోకి వెళ్లి వెంకటరమణమూర్తిని రక్షించి బయటకు తీసుకువచ్చారు. చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. వెంకటరమణమూర్తిని రక్షించిన ప్రకాష్‌బాబును ఫైర్ అధికారి ఏబీఎస్ఎస్ వేణు అభినందించారు.



బయటకు తీసుకువస్తున్న దృశ్యం



కానిస్టేబుల్ ప్రకాష్

గతంలో పనిచేసిన

ముమ్మిడివరం సీఐపై కేసు

ముమ్మిడివరం, జూలై 11: ముమ్మిడివరంలో గతంలో సీఐగా పనిచేసిన ఎం. జానకీరామ్‌పై ముమ్మిడివరం పోలీసుస్టేషన్‌లో 227/2024గా ఎఫ్ఐఆర్ నమోదైంది. ఒక సివిల్ వివాదం కారణంగా ఒక వ్యక్తికి మేలు చేకూర్చే విధంగా సీఐ వ్యవహరించారనే అభియోగంపై ఈ ఎఫ్ఐఆర్ నమోదైనట్టు సమాచారం. ముమ్మిడివరంలోని సర్వే నంబరు 518లో 3ఎకరాల 16 సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమికి సంబంధించి ముమ్మిడివరానికి చెందిన పోలిశెట్టి రాజేష్‌కుమార్‌కు మరికొందరికీ మధ్య చాలాకాలంగా సివిల్ వివాదం నడుస్తుంది. ఈ నేపథ్యంలో కోర్టులో పెండింగ్‌లో ఉన్న భూమికి సంబంధించి అమలాపురానికి చెందిన పిల్లా రమేష్‌కు పార్టీషన్ డీడ్ రాయించాడని, మల్లప శివరామకృష్ణ 2009లో మృతిచెందితే 2019లో మల్లప శివరామకృష్ణ వీలునామా ఎలా బయటికి వచ్చిందని, రాజేష్‌కుమార్ 2018 డిసెంబరు 13న ముమ్మిడివరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ క్రైమ్ ఇన్వెస్టిగేషన్‌లో పోలిశెట్టి రాజేష్‌కుమార్ చేసిన ఆర్టీఐ అప్లికేషన్‌కు ముమ్మిడివరం ఎస్‌హెచ్‌వో 2019లో ఒక అన్ రిజిష్టర్ వీలునామా ఇచ్చారని మరలా రాజేష్‌కుమార్ ఫైల్ చేసిన ఆర్టీఐ అప్లికేషన్‌కు అప్పటి సీఐ ఎం.జానకీరామ్ నోటరైజ్డ్ వీలునామా ఇచ్చారని పోలీసు రికార్డుల్లో అన్ రిజిష్టర్డ్ వీలునామాను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నోటరైజ్డ్ వీలునామాగా మార్చి పిల్లా రమేష్‌ను రక్షించేందుకు ప్రయత్నిస్తున్నాడని పోలిశెట్టి రాజేష్‌కుమార్ ఆరోపించారు. ఈ అభియోగంపై సీఐ జానకీరామ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిందిగా కోర్టు ముమ్మిడివరం పోలీసులను ఆదేశించినట్టు సమాచారం.

రాజమండ్రి	: శ్యామల	రాజానగరం	: ఫార్చ్యున్ 4 షోస్ సినిమాస్
రాజమండ్రి	: సూర్యప్యాలెస్	కత్తిపూడి	: సత్యనారాయణ
రాజమండ్రి	: ఊర్వశి	సీతానగరం	: గీతా సినిమాస్
కాకినాడ	: ఆనంద్ సినిమాస్	గొల్లప్రోలు	: గోవిందమహల్
కాకినాడ	: దేవి సినిమాస్	అన్నవరం	: NVR మల్టీ ప్లెక్స్
కాకినాడ	: తిరుమల	గొల్లలమామిడాడ	: శ్రీనివాస
కాకినాడ	: శ్రీ ప్రియ	అంగర	: వెంకటమాణిక్యాంబ
కాకినాడ	: PVR INOX	తిమ్మాపురం	: సూర్యరమ కాంప్లెక్స్
కాకినాడ	: సత్యగౌరి	ఉప్పాడ	: శ్రీనివాస
అమలాపురం	: VL రమ	రంపచోడవరం	: లలిత
మండపేట	: విజయమహల్	కోరుకొండ	: రామకృష్ణ
పిఠాపురం	: సత్య, పూర్ణ	కాతరపల్లి	: శ్రీలక్ష్మి
జగ్గంపేట	: JVR Screen	వేలంగి	: శ్రీనివాస
జగ్గంపేట	: నాగేశ్వర	చింతూరు	: ఓమ్ నవయుగ
రావులపాలెం	: వెంకటేశ్వర	రౌతులపూడి	: మహాలక్ష్మి
పెద్దాపురం	: వీరభద్ర	వాకలపూడి	: సూర్య సినీమ్యాక్స్
రాజోపాక	: శ్రీనివాస	జి.కొత్తపల్లి	: గోపీకృష్ణ సినీమ్యాక్స్
మలికిపురం	: శంకర	రాజోలుకోన	: పరమేశ్వర
యానాం	: పద్మ పి.ప్యాలెస్		
సామర్లకోట	: విఘ్నేశ్వర		
రామచంద్రాపురం	: సూర్యసినిమ్యాక్స్		
రాజోలు	: 4షోస్ సినిమాస్		
ఏలేశ్వరం	: జయశ్రీ		
రాయవరం	: రాయల్ టాకీస్		
కొత్తపేట	: సత్యచంద్ర		
నామవరం	: వి.యస్. మహల్		
ధవళేశ్వరం	: మురళీకృష్ణ		
ముమ్మిడివరం	: వెంకటేశ్వర		
లక్ష్మవరం	: వేణుగోపాలకాంప్లెక్స్		
ద్రాక్షారామం	: సూర్య సినిమ్యాక్స్		
కడియం	: వెంకట సూర్య		
గోకవరం	: శ్రీనివాస		
అనపర్తి	: సత్యగౌరి		



ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతో గాలింపు

గొల్లప్రోలు రూరల్, జూలై 11: గొల్లప్రోలు మండలం మల్లవరం ఆర్ఆర్‌బీ చెరువులో ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ గాలింపు చర్యలు కొనసాగించాయి. మండలంలోని ఏకే మల్లవరం గ్రామానికి చెందిన వృద్ధుడు తటవర్తి వేమన్నదొర పశువులు మేపేందుకు 7వ తేదీ సాయంత్రం మల్లవరంలోని ఆర్ఆర్‌బీ చెరువు వద్దకు వెళ్లి తిరిగి రాకపోవడంతో చెరువులో పడి గల్లంతై ఉండవచ్చునని పోలీసులకు ఫిర్యాదు అందింది. దీనిపై గజ ఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చేపట్టినా ఫలితం లేకపోయింది. దీంతో జిల్లా కలెక్టరు సూచనల మేరకు ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. రాత్రి వరకూ వృద్ధుడి ఆచూకీ లభించలేదని పోలీసులు తెలిపారు.

మండల ప్రజా పరిషత్ కార్యాలయము నరసాపురం

ఓ.క.సెం.AO/13/2024 తేది.11.07.2024

మాధవాయిపాలెం ఫెర్రి టెండరు కమ్ బహిరంగ వేలం 3వ ప్రకటన

ది.20.07.2024 శనివారం మధ్యాహ్నం గం.02.00లకు నరసాపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయము నందు నరసాపురం మండల ప్రజా పరిషత్ అధీనములో గల మాధవాయిపాలెం ఫెర్రి 2024-2025 ఆర్థిక సంవత్సరము అనగా 25.07.2024 నుండి 31.03.2025 వరకు టోల్లు వసూలు చేసుకొనుటకు సీల్డు టెండరుతో కూడిన బహిరంగ వేలము నిర్వహించబడును. ఆసక్తి గలవారు కాంట్రాక్టర్లు పాల్గొనవలసినదిగా కోరడమైనది.

వేలం వివరముల సంగ్రహము

1.ఫెర్రి వివరము	: మాధవాయిపాలెం ఫెర్రి నరసాపురం మండలం పశ్చిమగోదావరిజిల్లా.
2.టోల్లు వసూలు చేయు కాలము	: 2024-2025 ఆర్థిక సంవత్సరమునకు (25.07.2024 నుండి 31.03.2025 వరకు)
3.ప్రారంభ పాట మొత్తము	: రూ.3,61,00,000/- (2024-2025 ఆర్థిక సంవత్సరము మొత్తమునకు)
4.డిపాజిట్టు	: రూ.36,10,000/- కాగా (25.07.2024 నుండి 31.03.2024 వరకు) రూ.24,72,600/- చెల్లించవలెను.
5.పాట సొమ్ము చెల్లించు విధానము	: సమాన వాయిదాలలో చెల్లించు పద్ధతి (డిపాజిట్ సొమ్ము కలపకుండా మరియు రెండు నెలలు సొమ్ము అడ్వాన్సుగా చెల్లించి)
6.సాల్వెన్సీ మొత్తము	: రూ.3,61,00,000/- లలో (25.07.2024 నుండి 31.03.2025 వరకు) రూ.2,47,26,000/- లకు సమర్పించవలెను.
7.ఎ) టెండరు షెడ్యూలు ఖరీదు	: రూ. 2000/-
బి)సేల్స్ టాక్సు	: రూ.240/-
సి) షెడ్యూల ఫీజు చెల్లింపవలసిన విధానము	: మండల ప్రజా పరిషత్ మాధవాయిపాలెం రేవు అక్కౌంట్ నరసాపురం పద్దునకు చలానా ద్వారా జమ చేయవలెను. (లేదా) మండల పరిషత్ అభివృద్ధి అధికారి నరసాపురం వారి పేరున తీసిన డ్రాఫ్ట్
8.టెండరు షెడ్యూలు కొరకు దరఖాస్తు చేసుకొనుటకు ఆఖరు తేది	: 19.07.2024 శుక్రవారం మధ్యాహ్నం గం.2.00 ల వరకు
9.ధృవ పత్రములు స్వీకరించుటకు,EMDస్వీకరించుట మరియు Entry Passలు జారీ చేయుటకు ఆఖరు తేది	: 19.07.2024 శుక్రవారం సాయంత్రం గం.5.00ల వరకు
10.సీల్డు టెండర్లు స్వీకరించు తేది మరియు సమయం	: 20.07.2024 శనివారం మధ్యాహ్నం గం.02.00లకు వరకు
11.బహిరంగ వేలము తేది మరియు సమయము	: 20.07.2024 శనివారం మధ్యాహ్నం గం.02.00లకు నుండి
12.సీల్డు టెండర్లు తెరచు తేది మరియు సమయము	: 20.07.2024న జరుగు బహిరంగ వేలము తదుపరి టెండర్లు తెరవబడును.
13.టెండర్లు తెరచుట/బహిరంగ వేలము జరుగు స్థలము	: మండల ప్రజా పరిషత్ కార్యాలయము, నరసాపురం
14.వేలం నిర్వహించు అధికారి	: మండల పరిషత్ అభివృద్ధి అధికారి. లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని నిర్వహించబడును.

ఏ కారణంచేతనైన పాటను వాయిదా వేయుటకు మరియు రద్దు చేయుటకు నోటీసు జారీచేయు వారికి పూర్తి అధికారం కలదని తెలియచేయడమైనది. టెండరు షరతులు ఇతర వివరములకు నరసాపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయము నందు అన్ని పని దినముల యందు సంప్రదించవచ్చు. ఫోన్ నెంబరు: 9666290336, 9493742441

నరసాపురం
తేది.11.07.2024

మండల పరిషత్ అభివృద్ధి అధికారి
మండల ప్రజా పరిషత్ నరసాపురం

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

ప్రైవేట్ ఫైనాన్స్

రిటైర్డ్ పెన్షనర్స్ బుక్‌లపైన, Govt. ఉద్యోగస్తులకు పేస్లిప్‌పైన సులభవాయిదా పద్ధతిలో ఫైనాన్స్ మరియు అన్ని తరగతుల వారికి డాక్యుమెంట్స్‌పైన తక్షణ Pvt ఫైనాన్స్ 10లక్షలు లోపు ఇవ్వబడును. సిబిల్ చూడబడదు సెల్: 9666547338

AJD :186717

4 Lines CLASSIFIED Rs.230/- Only

బైక్‌ను ఢీకొన్న లారీ.. యువకుడి మృతి

రాజానగరం, జూలై 11: మండలంలోని ఫరిజెల్లిపేట సమీపంలోని చాగల్నాడు కాలువ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. తోకాడ గ్రామానికి చెందిన నల్లమిల్లి సందీప్(20), అతడి స్నేహితుడు గండి వీరవెంకట సత్యనారాయణ కలిసి మోటార్‌సైకిల్‌పై రాజానగరం వచ్చారు. తిరిగి వెళ్తుండగా మార్గమధ్యంలో చాగల్నాడు కాలువ సమీపంలోని మలుపులో ఎదురుగా వస్తున్న లారీ మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో సందీప్ కింద పడిపోవడంతో లారీ అతడి పైనుంచి దూసుకుపోవడంతో శరీర భాగాలు చెల్లాచెదురై అక్కడికక్కడే మృతి చెందాడు. సత్యనారాయణకు తీవ్రగాయాలు కావడంతో సమీపంలోని జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్ఐ పవన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భారీగా గంజాయి స్వాధీనం

రాజమహేంద్రవరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఓ లారీలో రవాణా చేస్తున్న గంజాయిని సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సెబ్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ వివరాలను వెల్లడించారు. దివాన్ చెరువు జంక్షను వద్ద బుధవారం వాహన తనిఖీలు చేస్తుండగా కాకినాడ నుంచి రాజస్థాన్ వెళ్తున్న ఓ లారీలో 153 కిలోల గంజాయిని గుర్తించామన్నారు. సీరారామ్, గోమద్‌రామ్ ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి సేకరించిన సమాచారంతో కాకినాడ రూరల్ సర్పవరంలో మరో 200 కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. అక్కడ తిమ్మాపురానికి చెందిన కోటిబోయిన ప్రసాద్, ఒడిసాకు చెందిన ప్రతాప్ మండల్‌ని అదుపులోకి తీసుకున్నామన్నారు. మొత్తం రూ.20 లక్షలు విలువ చేసే 353 కిలోల గంజాయి, రూ.6 వేల నగదు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గంజాయి రవాణాకు కారణమైన రాజస్థాన్‌కు చెందిన రామ్‌నివాస్, సందీప్ అనే వ్యక్తులను కూడా అరెస్టు చేశామని చెప్పారు.

అన్నదాన పథకానికి రూ.2 లక్షల విరాళం

అన్నవరం, జూలై 11: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి గురువారం బెంగుళూరుకు చెందిన ఐ.రామ్మోహన్, రమాసుందరి దంపతులు రెండు లక్షలు, సత్యదేవా గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ 50 వేలు విరాళంగా సమర్పించారు. దాత ఈమొత్తాన్ని ఆలయ సూపరింటెండెంట్ కంచి మూర్తికి అందజేయగా దాతను ఆయన అబినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు. హైదరాబాద్‌కు చెందిన వై.రాధాకృష్ణ అన్నదాన పథకానికి రూ 1,00,116లు సమర్పించారు. కార్యక్రమంలో ఏపీఆర్వో ఎం.గణపతి తదితరులు పాల్గొన్నారు.



విరాళం చెక్కు అందిస్తున్న దాతలు

అమలాపురంలో జనాభా నియంత్రణపై డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ
● పలు మండలాల్లో అవగాహన సదస్సులు

కూటమి ప్రభుత్వంలోనే తక్షణ న్యాయం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై11: కూటమి ప్రభుత్వంలోనే ఎస్సీ, ఎస్టీలకు సత్వరన్యాయం జరుగుతుందని టీడీపీ నాయకుడు ఆకుమర్తి చిన్న మాదిగ అన్నారు. గురువారం వెల్లలో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం కేసులో ఎస్సీఎస్టీ అత్యాచారాలనిరోధకచట్టం నిందితులకువర్తింపచేయాలని డీఎస్పీకి వినతిపత్రం అందజేశారు. గతప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీలపై ఎటు వంటి సంఘటనలు జరిగినా న్యాయం జరగలేదన్నారు. మంత్రి సుభాష్ చొరవతో విగ్రహం ధ్వంసం కేసును పోలీసులు చేదించారన్నారు.

నిత్యావసరాల ధరలు అందుబాటులోకి తేవడమే లక్ష్యం


కొత్తపేట రైతు బజార్‌లో బియ్యం, కందిపప్పు పంపిణీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, జూలై11: నిత్యావసరాల ధరలనుసామాన్యులకు అందుబాటులోకి తీసుకురావడమే కూటమి ప్రభుత్వలక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. స్థానిక రైతుబజార్‌లో రాయితీపై బియ్యం, కందిపప్పు పంపిణీ కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసరాల ధరలను రానున్నరోజుల్లో మరింత నియంత్రిస్తామన్నారు. బూసి జయ లక్ష్మిభాస్కరరావు, కంఠంశెట్టి శ్రీనివాసరావు, పాలూరి సత్యానందం, ధర్నాల రామకృష్ణ, రెడ్డి తాతాజీ, రెడ్డి శ్రీనివాస్, గుబ్బల మూర్తి, విశ్వ మారుతిప్రసాద్, బూసి మరియ్యమ్మ, సత్తిరాజు ఉషారాణి, తహసీల్దారు జి.ఎలీషా, ఎంఎస్‌వో శ్రీనివాసరావు, మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవ ఫ్లెక్సీపై తన పేరు వేయకుండా అవమానించారని సర్పంచ్ బూసి జయలక్ష్మి వా పోయారు. ఎమ్మెల్యే బండారు కలుగజేసుకుని ఇకపై ఇటు వంటి పొర పాట్లు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు.

రైతుబజారులో కందిపప్పు, బియ్యం విక్రయం

రావులపాలెం, జూలై 11: నిత్యావసర వస్తువుల ధరలను సామాన్యులకు అందుబాటులో ఉంచడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం రైతు బజార్‌లో తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు విక్రయాలను గురువారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, గుత్తుల పట్టాభిరామారావు, చిలువూరి సతీష్‌రాజు, జక్కంపూడి వెంకట స్వామి, నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

అమలాపురం రూరల్, జూలై 11: ఆర్టీసీ అమలాపురం డిపోలో గురువారం ఎంప్లాయీస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏపీపీటీడీ ఉద్యోగులు డిపో కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రీజనల్ కమిటీ నాయకుడు ఎన్ఆర్‌సీహెచ్ రావు అధ్యక్షత వహించారు. డిపో కార్యదర్శి ఎస్ఎస్వీ గణేష్, ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె.సత్తిబాబు ముఖ్య అతిథులుగా హాజరై యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. రీజనల్ కార్యదర్శి జి.చిరంజీవి, ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావం గురించి వివరించారు. ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను కూటమి ప్రభుత్వం గుర్తించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సుందరనీడి వెంకటగణేష్, మన్యం, ఆది, కె.ప్రసాద్, అధిక సంఖ్యలో నాయకులు పాల్గొని కేక్ కట్ చేశారు.


అమలాపురం: ఆవిర్భావ దినోత్సవ కేక్‌ను కట్‌చేస్తున్న నాయకులు

రావులపాలెం: ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో సహ కన్వీనర్లు అడపా గరగరావు, కేఎల్ నారాయణ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు రావుల సుబ్బారావు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీహెచ్ గోవిందరాజు, వీవీ రెడ్డి, తోట చిన వీరభద్రరావు, ఎల్ఎస్ఎస్ కుమార్, లక్ష్మణమూర్తిపాల్గొన్నారు.

జనసేనకు నామినేటెడ్ పదవులు కేటాయించాలి


కొమానపల్లిలో సమావేశమైన జనసేన పార్టీ నాయకులు

ముమ్మిడివరం, జూలై11: ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి విశేష కృషిచేసిన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల కేటాయింపులోప్రాధాన్యం ఇవ్వాలని పార్టీ ముమ్మిడివరం నియోజకవర్గ సమావేశం డిమాండు చేసింది. గురువారం కొమానపల్లిలోని ప్రైవేటు గెస్ట్ హౌస్‌లో దూడల స్వామి అధ్యక్షతన జరిగిన జనసేన పార్టీ నియోజకవర్గ సమావేశంలో నాయకులు, కార్యకర్తలు మాట్లాడారు. జనసైనికులంతా టీడీపీ నాయకులు, కార్యకర్తలను కలుపుకుని గ్రామాల్లో ప్రజాసమస్యలను పరిష్క రిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ఐదుగురు సభ్యులతో గ్రామ, నగరపంచాయతీ కమిటీల నియామకాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని సమావేశం తీర్మానించింది. ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో పవన్‌కల్యాణ్ చిత్రపటాన్ని ఏర్పాటుచేయాలని సీఎంచంద్రబాబు సూచించడం హర్షణీయమన్నారు. అత్తిలి బాబూరావు, మద్దింశెట్టి పురుషోత్తం, మోకా బాలప్రసాద్, గుద్దటి జమ్మి, త్సవటపల్లి నాగభూషణం, గోదశి పుండరీష్, ముత్యాల జయలక్ష్మి, రాయపురెడ్డి బాబి, నూకల దుర్గ, పుణ్యమంతుల సూరిబాబు, రంబాల రమేష్, గుద్దటి విజయ్, చింతలపూడి పల్లంరాజు, లంకలపల్లి జమిలతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొన్నారు.

అధికారులు మండల సమావేశానికి హాజరుకావాల్సిందే

పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

మామిడికుదురు, జూలై 11: మూడు నెలలకొకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాల్సిందేనని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం మామిడికుదురు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కుసుమ వనజాకుమారి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రధానంగా విద్య, వైద్యం, తాగునీరు, రెవెన్యూ, విద్యుత్ శాఖల అధికారులు నిత్యం అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందించాలని, నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. నగరం సర్పంచ్ జాలెం రమణకుమారి నగరం పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో ఉండడం లేదని సమావేశం దృష్టికి తీసుకురాగా దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యులు అందుబాటులో లేకపోతే చర్యలు తప్పవన్నారు. త్వరలో నియోజకవర్గంలోని రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. సమావేశం అనంతరం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఎమ్మెల్యేను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.వేణుగోపాలరెడ్డి, ఏవో కె.వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ

అమలాపురం టౌన్, జూలై 11: అమలాపురం ఏరియా ఆసుపత్రి వద్ద గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత జనాభా నియంత్రణపై డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. తల్లి, బిడ్డ శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భధారణ, బిడ్డకు బిడ్డకు మధ్య అంతరం పాటించాలంటూ నినాదాలు చేశారు. కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలన్నారు. ర్యాలీలో అదనపు డీఎంహెచ్‌వో సీహెచ్‌వీ భరతలక్ష్మి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి వీవీవీ సత్యనారాయణ, వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. బండారులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. కుటుంబ నియంత్రణ ఆవశ్యకతను ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ గంటి హరీష్‌బాలయోగి వివరించారు. విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉప్పుగంటి భాస్కరరావు, బట్టు పుల్లేశ్వరరావు (పండు), బళ్ల స్వామి వివేకానంద, రమేష్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అమలాపురం: బండారులంక జనాభా దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఎంపీ హరీష్‌బాలయోగి తదితరులు

ముమ్మిడివరం: జనాభా పెరుగుదల వల్ల అభివృద్ధికి ఆటంకంగా మారుతుందని అడిషనల్ డీఎంహెచ్‌వో సీహెచ్‌వీ భరతలక్ష్మి పేర్కొన్నారు. పీపుల్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం డాక్టర్ ఎంజీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన అవగాహన సదస్సులో భరతలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కిరణ్, రామరాజు, భానుప్రసాద్, చంద్రరావు, జి.దుర్గాప్రసాద్, కె.వెంకటేశ్వరరావు, ఎం.శివకుమార్, కార్తీక్, విద్యార్థులు పాల్గొన్నారు.

మలికిపురం: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మలికిపురం డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ టి.సతీష్ అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ రాజోలు సీడీపీవో వైకేడీ రమాదేవి మాట్లాడుతూ జనాభా పెరుగుదలతో అనేక సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా నైపుణ్యం పెంచుకోవాలన్నారు. ఎస్.రమేష్‌బాబు, విజయ్‌కుమార్, ఆంజనేయులు, శ్రీనివాస్, ఆనందమహానీ తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: జనాభా నియంత్రణపై అవగాహనా ర్యాలీలు ఈదరాడ, నగరం గ్రామాల్లో గురువారం నిర్వహించారు. కుటుంబ నియంత్రణా పద్ధతుల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నగరం, లూటుకుర్రు పీహెచ్‌సీ సిబ్బంది, ఆశకార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

రాయవరం: మాచవరంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మాచవరం పీహెచ్‌సీ వైద్యులు ఎం.శ్రీనివాస్, కె.మణికంఠ మాట్లాడుతూ మొదటి, రెండో బిడ్డకు మధ్య మూడేళ్ల తేడా ఉండాలన్నారు. కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్‌వో తులసీదాస్, ఎంపీహెచ్ఎస్ ఎ.గోపాలకృష్ణ, ల్యాబ్ టెక్నిషియన్ శివప్రసాద్, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

పి.గన్నవరం: నాగుల్లంక పీహెచ్‌సీలో వైద్యాధికారి డాక్టర్ వైప్రియాంక అధిక జనాభా వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి ప్రధాన రహదారిపై మానవహారంగా ఏర్పడ్డారు. ఎంపీహెచ్ఈ వోలు ఎ.నాగరాజు, ఎస్.శ్రీనివాసరెడ్డి, పీహెచ్ఎన్ ఏకే దుర్గాబాయి, ఎంపీహెచ్ఎస్ బీవీవీఎస్ఎన్ మూర్తి, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్వేది: రామేశ్వరం, సఖినేటిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అధికారులు, సిబ్బంది గురువారం ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు రామేశ్వరం వైద్యాధికారి యూనస్ మాట్లాడుతూ కుటుంబ నియంత్రణతో ఆర్థికాభివృద్ధి సాధ్యమన్నారు. డాక్టర్ వీజే గాయత్రీ, డాక్టర్ సీహెచ్ దుర్గాకావ్య, డాక్టర్ ఎండీఎంఏ యూనస్, ఎంపీపీ వీరా మల్లిబాబు, మాజీ సర్పంచ్ పోతురాజు నాగేంద్రకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలమూరు: పెదపళ్ల పీహెచ్‌సీ వద్ద వైద్యాధికారులు భవానీశంకర్, సాయికిషోర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జనాభా పెరుగుదల వల్ల సంభవించే సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రాజా, సీహెచ్‌వో రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: అంగర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవంపై అవగాహన సదస్సు, ర్యాలీ, మానవహారం నిర్వహించారు. వైద్యాధికారిణి డాక్టర్ రత్నకుమారి జనాభా పెరుగుదల వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఎంపీహెచ్ఈవో మల్లికార్జునుడు, హెచ్ఈ రామారావు, హెచ్‌వీ మేరీమణి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 11: రామచంద్రపురం పట్టణంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కోసం పట్టణంలో కొన్ని ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ విజయానంద్ తెలిపారు. శీలంవారి సావరం, వైఎస్ఆర్ నగర్, బీర్‌ఫ్యాక్టరీ, రైలు గట్టు, శాంతినగర్, రాజగోపాల్‌సెంటర్, ద్రాక్షారామ రోడ్డు, వెల్లవాటర్‌వర్క్సు, పాతబస్టాండు, బ్రాడీపేట, రాజబాబునగర్, డీఎస్పీ కార్యాలయం వీధి ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

పి.గన్నవరం: పి.గన్నవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పి.గన్నవరం, నాగుల్లంక, ముంగండ పీడర్లతో పాటు నరేంద్రపురం సబ్‌స్టేషన్ పరిధిలోని నరేంద్రపురం, గంటిపెదపూడి పీడర్ల పరిధిలో మరమ్మతులు కోసం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ ఎం.రవికుమార్ తెలిపారు. మండలం మొత్తం విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆత్రేయపురం: ఆత్రేయపురం, అంకంపాలెం, పేరవరం సబ్ స్టేషన్ల పరిధిలో 33కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంత రాయం కలుగుతుందని ఈఈ ఎం.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 17గ్రామాల్లో శుక్రవారం ఉదయం8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

కపిలేశ్వరపురం: చెట్లు నరకడం, తీగలు సరిచేయడం కోసం కపిలేశ్వరపురం, అంగర, పడమరఖండ్రిక, వెదురుమూడిగ్రామాల్లో శుక్రవారం ఉదయం8నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు రామచంద్రపురం విద్యుత్‌శాఖ డీఈ వై.విజయానంద్ తెలిపారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.50వేలు విరాళాలు

ఆత్రేయపురం,జూలై11: వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి ఉండ్రాజవరం మండలం పాలంగికి చెందిన తుమ్మలపల్లి సుబ్బారావు-కాంచన దంపతులు రూ.50,116, ఆత్రేయపురానికి చెందిన ముదునూరి శ్రీనివాసరాజు-మంగవేణి దంపతులురూ.10,116విరాళం ఇచ్చారు.

అయినవిల్లి: ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాణేలంకకు చెందిన గోదశి నాగేశ్వరరావు కుటుంబ సమేతంగా శ్రీసిద్ధివినాయకస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అన్నప్రసాద ట్రస్టుకు రూ.25వేలు ఇచ్చారు.

ప్రమాదకర స్థితిలో దిండి-చించినాడ బ్రిడ్జి

మలికిపురం, జూలై 11: ఉభయ గోదావరి జిల్లాలను కలుపుతూ వశిష్ఠ నదిపై దిండి-చించినాడ మధ్య వంతెన నిర్మించిన 24 సంవత్సరాలు గడిచినా నేషనల్ హైవే అధికారులు పట్టించుకోకపోవడంతో మానవతామూర్తుల సామాజికసేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. ఏడాది క్రితం ఈ సంస్థ ఆందోళన వ్యక్తం చేయగా అప్పటి అధికారులు కంటితుడుపు చర్యగా కొద్దిపాటి మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారు. ఏడాదికే వంతెన మరలా యథాస్థితికి రావడంతో మానవతామూర్తులు సామాజికసేవా సంస్థ మరోసారి ఆందోళన చేపట్టింది. స్పందించిన నేషనల్ హైవే అధికారులు జీవన్ (ప్రాజెక్టు లైనర్), ప్రాజెక్టు మేనేజరు గోపాల్‌కిరణ్, అధికారుల సమక్షంలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. సభ్యులు అడ్డుకోగా వర్షాకాలం తర్వాత అక్టోబరు నెలలో పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి నూతన లైటింగ్ విధానం ఏర్పరిచి పోలీసుల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించి సమస్యను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా త్వరితగతిన పనులు పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. బోనం రాజు, ఎంపీ సత్యవాణి, ఎం.రాము, ఎం.శ్రీనివాసరాజు, నల్లి మోహన మాస్టారు పాల్గొన్నారు.


బ్రిడ్జిని పరిశీలిస్తున్న నేషనల్ హైవే అధికారులతో మానవతామూర్తుల సభ్యులు

పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలి


వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

అమలాపురం టౌన్, జూలై 11: అతిసార కేసుల నియంత్రణ చర్యల్లో భాగంగా పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ సూచించారు. గురువారం ఆయన వార్డు కార్యదర్శులు, క్లస్టర్ సిబ్బందితో సమీక్షించారు. సెప్టెంబరు 30వరకు జరిగే స్టాప్ డయేరియాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వర్షాకాలంలో దోమల నివారణ తదితర అంశాలను పర్యవేక్షించేందుకు పట్టణంలోని 15సచివాలయాలను 274క్లస్టర్లుగా విభజించి 107 మంది కార్యదర్శులను 17మంది సిబ్బందిని సూపర్‌వైజర్లుగా నియమించామన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. తాగునీటి పైపులైన్ల లీకేజీలను గుర్తించడం, వాటిని అరికట్టడం, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సురక్షిత తాగునీరు అందించడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపడతామన్నారు. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌తో పాటు పురపాలక సంఘంలో కంట్రోల్ రూము మొబైల్ నెం.9121233006 ఏర్పాటు చేశామని కమిషనర్ తెలిపారు. మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ నాగేంద్రప్రసాద్, ఎన్విరాన్‌మెంటల్ కార్యదర్శి బండి వీరన్న ఆధ్వర్యంలో విద్యార్థులకు అతిసార వ్యాధిపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల గురించి తెలియచేశారు. హెచ్ఎం బందా ఆర్.కామేశ్వరరావుపాల్గొన్నారు.

సీఏ విజేత సూర్యకిషోర్‌కు అభినందనలు

అల్లవరం, జూలై 11: బెండమూర్లంక గ్రామానికి చెందిన రైతు ఈలి స్వామి కుమారుడు కిషోర్ సీఏ పరీక్షల్లో ఉత్తీర్ణుడయ్యాడు. గురువారం జనసేన నాయకుల సమక్షంలో కేక్ కట్ చేశారు. నాయకులు గుర్రం కృష్ణ, పిండి గణపయ్య, నల్లా రాము, కటికిరెడ్డి బాబి, కాకిలేటి హరికృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, టీడీపీ నాయకులు గిడుగు భాస్కరరావు, యాళ్ల అబ్బులు, గుర్రం బాబ్జీలు తదితరులు కిషోర్‌ను అభినందించారు.

20న వికాస ఆధ్వర్యంలో జాబ్‌మేళా



రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 11: రామచంద్రపురం వీఎస్ఎం కళాశాలలో ఈనెల20న వికాస ఆధ్వర్యంలో 1859 ఉద్యోగాలకు జాబ్ మేళా నిర్వహిస్తారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ కుమార్తెలు సత్యదివిత, సత్య దీక్షత జన్మదినం కావడంతో గురువారం జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్‌ను పిల్లలతో కలిసి మంత్రి ఆవిష్కరించారు.


కూలీలకు కూలి చెల్లించక పోవడంతో ఇసుక తరలింపు నిలిపివేత

కపిలేశ్వరపురం, జూలై 11: కపిలేశ్వరపురం, తాతపూడి స్టాక్‌పాయింట్ల నుంచి ఈనెల8న ప్రారంభమైన ఉచిత ఇసుక తరలింపు జట్టు కూలీలకు నగదు చెల్లించకపోవడంతో గురువారం నిలిచిపోయింది. ఈసందర్భంగా జట్టుకార్మిక సంఘం యూనియన్ నాయకుడు కొప్పిశెట్టి వాసు విలేకరులతో మాట్లాడుతూ కపిలేశ్వరపురం స్టాక్‌పాయింట్ నుంచి ఇసుక తరలిస్తున్న జట్టు కార్మికులు 32మందికి ఈనెల9,10తేదీలకు సంబంధించి నగదు చెల్లించలేదన్నారు. తహసీల్దార్ రాజరాజేశ్వరి దృష్టికి సమస్యను తీసుకువెళ్ళగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చారన్నారు. రెండు రోజులైనప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో స్టాక్ పాయింట్ నుంచి ఇసుక తరలింపు నిలిపివేసినట్లు తెలిపారు. తాతపూడి స్టాక్‌పాయింట్‌లో జట్టుకూలీలు 14మందికి నగదు చెల్లించకపోవడంతో అక్కడ కూడా గురువారం ఇసుక తరలింపు నిలిచిపోయినట్లు తెలిపారు.

ముగిసిన దివ్యజ్ఞాన మోక్ష అఖండ హోమం

అమలాపురంటౌన్, జూలై11: వారాహి షోడశరాత్రి పూజా మహోత్సవాల్లో భాగంగా చేపట్టిన దివ్యజ్ఞాన మోక్ష అఖండ హోమ మహా పూర్ణాహుతిని గురువారం తెల్లవారుజామున మూడు గంటలకు నిర్వహించారు. ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి మంత్రాహుతులతో, నానావిధ పరిమళ సుగంధ ద్రవ్యాలతో, పట్టు వస్త్రాలతో అగ్ని భగవానుడికి పూర్ణాహుతి సమర్పించారు. వేము వెంకటశివకుమార్, సత్తి కిషోర్, పోతురాజు రామకృష్ణ-నాగకనకదుర్గ, తూము దొరబాబు, గొవ్వాల అచ్యుతరామయ్య, పెద్దిరెడ్డి వెంకటదుర్గేష్, చాగంటి ప్రసాద్, నందు, తూము రూపావతి, తూము చిట్టిబాబు, నాగమణి, భక్తులు పాల్గొన్నారు.

ప్రకటన



కీ.శే. శివకోటీ వెంకటరత్నం గారు
మరణం : 19-8-1996
డా.బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం రామరాజులంక గ్రామం, డోర్ నెం.5-80/1కు చెందిన శివకోటి జ్ఞానబ్రహ్మం S/o వెంకటరత్నం (లేటు) అను నేను తెలియచేయు ప్రకటన.
నా తండ్రి గారైన శివకోటి వెంకటరత్నం S/o చిన శేషయ్య గారు ది.19-8-1996వ తేదిన మా ఇంటి వద్ద మరణించినారు. వీరి మరణం రామరాజులంక గ్రామ పంచాయితీలో నమోదు కాలేదు. దీనిపై ఏమైనా అభ్యంతరాలు ఉన్నయెడల 10రోజులలో తెలియజేయగలరు.
శివకోటీ జ్ఞానబ్రహ్మం S/o వెంకటరత్నం (లేటు)
రామరాజులంక, మలికిపురం మండలం
డా.బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా - 533 253
సెల్: 9666287624

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

అంతర్వేది, జూలై 11: వీవీమెరక, మోరి, అంతర్వేదిపాలెం హైస్కూలుకు చెందిన నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు ఎండీవోలు డి.కిశోర్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. వీవీమెరక జడ్పీ పాఠశాలకు చెందిన కొండా సోనాలి ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళం, అంతర్వేదిపాలెం జడ్పీ పాఠశాలకు చెందిన బొమ్మిడి సంగీత ఒంగోలు, మోరి జడ్పీ హైస్కూలుకు చెందిన గుమ్మడి పూర్ణవంశీకార్తీక్ శ్రీకాకుళం, జాన లోహితాసాయికోటతేజస్వీ ఒంగోలు ట్రిపుల్ ఐటీలకు ఎంపికైనట్టు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాలల హెచ్ఎంలు శ్రీధర్‌కృష్ణ, డి.జగదీప్‌కుమార్, జె.సుగుణలతో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పేరెంట్స్ కమిటీలు హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ఐ.పోలవరం: కొమరగిరి జడ్పీ హైస్కుల్‌కు చెందిన విద్యార్థులు కూడిపూడి కీర్తన నూజివీడు ట్రిపుల్‌ఐటీకి, పసుపులేటి అనూష, యెల్లా మనోజ్ఞ శ్రీకాకుళం ఐటీకి ఎంపికయ్యారన్నారు హెచ్ఎం కె.శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులను సర్పంచ్ విజయ చాముండేశ్వరి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉప్పలగుప్తం: మండలంలోని నాలుగు ఉన్నత పాఠశాలల నుంచి 19మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు ఎంఈవో సత్తి సత్యకృష్ణ తెలిపారు. భీమనపల్లి ఉన్నత పాఠశాల నుంచి ఎనిమిది మంది, ఎస్.కొత్తపల్లి ఆరుగురు, గొల్లవిల్లి నుంచి ఒకరు,మునిపల్లి నుంచి ఒకరు ఎంపికయ్యారు.

కొత్తపేట: ట్రిపుల్ ఐటీకి మండలం నుంచి 9మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఈవోలు హరిప్రసాద్, లీలావతి తెలిపారు. కొత్తపాలెం జడ్పీ హైస్కూలుకు చెందిన కోలా మోహనసత్యశ్రీ, చిట్టూరి తారక నాగవెంకట సాయిమణికంఠ, గుబ్బల శ్రీరూప, అవిడి చప్పిడివారిపాలెం హైస్కూలుకు చెందిన ఎం.నవనీత్, పి.పావని, చైతన్యపద్దు, కొత్తపేట హైస్కూలుకు చెందిన కొప్పిశెట్టి యజ్ఞత, వానపల్లి హైస్కూలుకు చెందిన బళ్ళ తేజ, మోడేకుర్రు హైస్కూలుకు చెందిన పి.శ్రావ్యలక్ష్మిప్రియ ఎంపికయ్యారు. వీరిని ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.

మండపేట: ఏడిద జడ్పీ హైస్కుల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని హెచ్ఎం ముంగర వెంకట్రాజు తెలిపారు. మల్లేశ్వరపు శిరీషా, అంబికా వర్షిణి, ఆర్.అక్షయ్ నూజివీడు ఐటీకి, జె.దివ్యశ్రీ, కె.వి.వి.ఎస్.ఎస్.జయకార్తీక్ శ్రీకాకుళం ఐటీకి ఎంపికయ్యారన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాని ఫొటో ఏర్పాటు చేయాలి

మండపేట, జూలై11: ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటాలను ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోనా సత్యనారాయణ తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు.

సబ్జెక్టు టీచర్ల కొరతను నివారించాలి

అమలాపురం టౌన్, జూలై 11: ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేయడంతో ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఏర్పడిందని, ఆ ఇబ్బందిని అధిగమించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ దృష్టికి ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతంశెట్టి దొరబాబు, సరిదే సత్యపల్లంరాజు తీసుకెళ్లారు. గురువారం ఎస్టీయూ జిల్లా సంఘ నాయకులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందించారు. సబ్జెక్టు టీచర్ల కొరతను అధిగమించేందుకు డీఎస్సీ నియామకాలు జరిగేలోపు వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ విద్య బలోపేతానికి తగిన చర్యలు తీసుకుంటానని భరోసానిచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా ఆర్థిక కార్యదర్శి నేరేడుమిల్లి సత్యనారాయణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు నల్లా రామకృష్ణ, సంఘ నాయకులు వేమన సత్యనారాయణ, వంగా అయ్యప్పకుమార్, నందెపు శ్రీనివాస్, బాలనాగు గుప్తా, మంగం సుధాకర్, నల్లా సుబ్రహ్మణ్యం, బసవా వేణుగోపాల్ ఉన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: ఓజీ
శ్రీలలిత	: సారంగ దరియా
శేఖర్ స్క్రీన్-1	: కల్కి
శేఖర్ స్క్రీన్-2	: ---
రమా	: భారతీయుడు 2
గణపతి	: రౌడీ గ్యాంగ్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: కల్కి
వెంకటపద్మావతి స్క్రీన్-2	: ---

రైస్ మిల్లర్స్ జిల్లా అధ్యక్షుడు చౌదరికి సన్మానం


చుండ్రు వీవీఎస్ఎస్ చౌదరిని సన్మానిస్తున్న కూటమి నాయకులు

కె.గంగవరం, జూలై11: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రైస్ మిల్లర్స్ అధ్యక్షుడిగా ఎన్నికైన చుండ్రు వీవీఎస్ఎస్ చౌదరి(యండగండి చౌదరి)నిగురువారం కూటమి కె.గంగవరం మండల నాయకులు ఘనంగా సన్మానించారు. ఆయనతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలి పారు. అలాగే కోలంకకు చెందిన విజయగోపాల్‌రాజు చౌదరికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కూటమి నాయకులు దేవరపల్లి బుల్లి, పెన్నాడ త్రిమూర్తులు, నంగి బాబి, సాదా రామకృష్ణ, శీరెడ్డి సత్తిబాబు, సలాది వెంకటరమణ, నున్న వినయ్, దేవరపల్లి సుధీర్,యలమాటి శ్రీను, చాగంటి శ్రీను, అడపా శ్రీనివాసు, నంగి రామకృష్ణ, నున్న వీర్రాజు, నంగి పుల్లయ్య, కరుటూరి రాంబాబు, మాజీ ఎంపీటీసీ దాకి ఏలియా పాల్గొన్నారు.

నవోదయకు భువనలాస్య ఎంపిక



ద్రాక్షారామ, జూలై 11: నవోదయ 5వ తరగతిలో ప్రవేశానికి ఏరుపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థిని గోర్తభువన లాస్య ఎంపికైనట్లు హెచ్ఎం వి.నాగేశ్వరరావు తెలిపారు. ఆమెను హెచ్ఎం, ఎంఈవో ఎం.శ్రీనివాస్ అభినందించారు.

విద్యుత్ అక్రమ వినియోగంపై ఫిర్యాదు

ఐ.పోలవరం, జూలై 11: లైన్‌మన్ కాసురాజు సహకారంతో టి.కొత్తపల్లికి చెందిన వాడ్రేవు ధర్మారావు అక్రమంగా ఎస్సీ సబ్‌ప్లాన్ పేరుతో విద్యుత్ సర్వీసును పొందాడని అదే గ్రామానికి చెందిన నల్లా వెంకట్రావు విద్యుత్ శాఖకు ఫిర్యాదు చేశాడు. ఏడాది నుంచి అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నాడని పేర్కొన్నాడు. దీనిపై విద్యుత్ శాఖ ఏఈని వివరణ కోరగా విషయం తన దృష్టికి వచ్చిం దన్నారు. ఫిర్యాదుపై విచారణ చేస్తామన్నారు.

రికార్డుల పరిశీలన

ముమ్మిడివరం, జూలై 11: కోనసీమ జిల్లా సమగ్ర శిక్షా కార్యాలయ ఫైనాన్స్ అండ్ అక్కౌంట్స్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ గురువారం ముమ్మిడివరం మండల విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయంలో రిజిష్టర్లను, రికార్డులను ఆయన నిశితంగా పరిశీలించారు. రికార్డుల నిర్వహణకు సంబంధించి ఎంఈవోలకు, సిబ్బందికి సూచనలిచ్చారు. ఆయన వెంట సీనియర్ అక్కౌంటెంట్ ప్రసాద్, ఎంఈవోలు బొజ్జా రమణశ్రీ, ఆర్.ఉదయభాస్కరరావు ఉన్నారు.

సత్యనారాయణశర్మ దంపతులకు సత్కారం

అంబాజీపేట, జూలై 11: వందకుపైగా దేవాలయాలకు ప్రతిష్ఠలు నిర్వహించిన శైవాగమ సామ్రాట్ పుల్లేటికుర్తి సత్యనారాయణశర్మ ఆదర్శనీయుడని పలువురు అర్చకులు అన్నారు. గురువారం మొసలపల్లి భోగేశ్వర స్వామి ఆలయంలో సత్యనారాయణశర్మ దంపతులను మండల ఆదిశైవ అర్చక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

నేడు మండపేట మండల పరిషత్ సమావేశం

మండపేట,జూలై11: స్థానికమండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండలపరిషత్ సమావేశం ఎంపీపీ ఉండమట్ల వాసు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో శ్రీదేవితెలిపారు. ఎమ్మెల్యే వేగుళ్ల హాజరవుతారన్నారు.

అప్పనపల్లికి బస్సు సర్వీసు ఏర్పాటుచేయాలి

మామిడికుదురు, జూలై 11: బాలబాలాజీ స్వామి కొలువై ఉన్న అప్పనపల్లికి అమలాపురం నుంచి బస్సు సౌకర్యం కల్పించాలని ఆక్సిజన్ అసోసియేషన్ సభ్యులు గురువారం అమలాపురం ఆర్టీసీ డిపో సూపరింటెండెంట్ సాయిబాబును కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆక్సిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కటికిరెడ్డి గంగాధరం, సభ్యులు పాల్గొన్నారు.

ప్రాణాపాయం నుంచి కాపాడేది హెల్మెట్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 11: ప్రాణాపాయం నుంచి కాపాడేది హెల్మెట్ అని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, ఏజేఎఫ్‌సీ మేజిస్ట్రేట్ వి.నాగేశ్వరరావు నాయక్ అన్నారు. గురువారం స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు హెల్మెట్ ధారణపై మండల లోక్‌అదాలత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీ, ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ, కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్, ప్రిన్సిపాల్ కె.సత్యలత, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆవు దూడ పుట్టే వీర్యం అందుబాటులో

కపిలేశ్వరపురం, జూలై 11: పశువులకు ఆవుదూడ పుట్టే విధంగా ప్రతీ ఆసుపత్రిలో వీర్యం అందుబాటులో ఉంచాలని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అంబేద్కర్ అన్నారు. గురువారం వెదురుమూడిలో పశుసంవర్ధక శాఖ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఉపసర్పంచ్ చుండ్రు అచ్యుతరామయ్య ప్రారంభించారు. 74పశువులకు వైద్యసేవలు అందజేశారు. పశుగణాభివృద్ధి సంస్థ ద్వారా రూ.17వేలు విలువైన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు బోణం నానిబాబు, ఆలమూరు పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ ఎల్.అనిత, డాక్టర్ విజయ్, డాక్టర్ కళ్యాణి, అంగర పశువైద్యాధికారి డాక్టర్ వీవీ రమణమూర్తి, రైతులుపాల్గొన్నారు.

డీజీపీని కలిసిన కామన

మండపేట, జూలై 11: డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావును మంగళగిరిలోని ఆయన చాంబర్‌లో గురువారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

